
సాక్షి ఆదిలాబాద్

సోమవారం, 27, ఫిబ్రవరి, 2023



రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు!
సైబర్ మోసగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. పెన్సిళ్ల వ్యాపారం పేరిట అమాయకులకు కుచ్చుటోపీ పెట్టారు. 8లో▸



పులుల కదలికల పరిశీలన
భీంపూర్ మండలం గుంజాల, గొల్లఘాట్ శివారులో పులులు సంచరిస్తున్న ప్రాంతాలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. పాదముద్రలు సేకరించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /21.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



చరణ్‌తేజ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన కే చరణ్‌తేజ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహిస్తున్న 23వ కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీల్లో 11–18 ఏళ్ల విభాగంలో ఏడో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు చరణ్‌తేజను డీవైఎస్వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పెటా ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, స్విమ్మింగ్ కోచ్ కృష్ణ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



పతకాలతో జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్: రాష్ట్ర స్థాయి యువజన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పోటీల్లో అండర్–14 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో మెస్రం జగ్జీవన్ గోల్డ్‌మెడల్, అండర్–16 విభాగం 400 మీటర్ల రన్నింగ్‌లో తెలంగరావు కాంస్యం, అండర్ –18 విభాగంలో సోన్ కాంబ్లే సంజన, హ్యామర్ త్రోలో గోల్డ్ మెడల్, షాట్‌పుట్‌త్రోలో చిన్నారామ్ గోల్డ్‌మెడల్, హైజంప్‌లో సెహ్వాగ్ రజతం, హ్యామర్‌త్రోలో అనిల్ కాంస్య పతకాలు సాధించారు. వీరికి ఆదివారం పతకాలు అందజేసినట్లు కోచ్ రాకేశ్ తెలిపారు. క్రీడాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పిట్ల రాజేశ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి పార్థసారథి, పెటా సంఘం నాయకుడు స్వామి తదితరులు అభినందించారు.

కాంగ్రెస్ ప్లీనరీకి సాజిద్‌ఖాన్



ప్లీనరీ సమావేశాలకు హాజరైన సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాజధాని నవ రాయ్‌పూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ ప్లీనరీకి పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆదివారం హాజరయ్యారు. 'భారతదేశం–కాంగ్రెస్ పార్టీ' అనే అంశంపై వక్తలు ప్రసంగించినట్లు సాజిద్‌ఖాన్ పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



కార్యక్రమానికి హాజరైన భక్తులు

బజార్‌హత్నూర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు చెందిన శ్రీదేవకీనందన్ ఠాగూర్‌జీ మహరాజ్ పేర్కొన్నారు. మంజీరతండా గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భగవత్ కథ పారాయణ ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మహరాజ్ మట్లాడారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని జయించేందుకు ధ్యానం చేయాలని సూచించారు. చివరిరోజు అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం మహా అన్నదానం చేశారు. ఎంపీపీ అజాడే జయశ్రీ, సర్పంచ్ చందర్‌సింగ్, ఆర్పీఎస్ మండలాధ్యక్షుడు నిస్తే కైలాస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నినాదాలు చేస్తున్న కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గౌరవాధ్యక్షురాలు ఆత్రం అనుసూయ తెలిపారు. అధ్యక్షుడిగా కుర్సంగె తానాజీ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నాయకులు పూసం ఆనంద్‌రావు, భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

మొక్కుబడి పనులే..!



జిల్లా కేంద్రంలోని గెజిటెడ్–1 పాఠశాలలో 625 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 300 మంది బాలికలున్నారు. 'మన ఊరు–మనబడి' కింద ఈ పాఠశాల ఎంపికైంది. టెండర్ ద్వారా రూ.1.23కోట్లతో కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. కిచెన్‌షెడ్, రెండు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టగా ఇంకా పనులు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలలో నాలుగు యూనిట్ల మరుగుదొడ్లు, ఒకసైడ్ కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉండగా నెలరోజులుగా పనులు నిలిచాయి. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి కావడం అనుమానమే. అయితే ఈ పాఠశాలలో రెండు యూనిట్లు మాత్రమే మరుగుదొడ్లున్నాయి. దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



భీంపూర్ మండలం వడూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల చిత్రమిది. పాఠశాలలో ఫ్లోరింగ్ చేయకుండా వదిలేశారు. సంప్ కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. కాంట్రాక్టర్ పనులు అర్ధంతరంగా నిలిపివేశాడు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బోథ్ జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో బేస్మెంట్ దశలోనే పనులు

- నత్తనడకన 'మన ఊరు–మనబడి'
- వచ్చే విద్యాసంవత్సరం నాటికి డౌటే..
- 237 స్కూళ్లలో ఐదింటిలోనే మరూ
- ఆదర్శ పాఠశాలల పరిస్థితీ అంతే..
- పనులు నిలిపివేస్తున్న కాంట్రాక్టర్లు
- విద్యార్థులకు తప్పని తిప్పలు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం 'మన ఊరు–మనబడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతేడాది మార్చిలో కార్యక్రమాన్ని ప్రారంభించగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని పాఠశాలల పనులు ప్రారంభం కాకపోగా, మరికొన్నింటి పనులు పునాది దశలోనే ఉన్నాయి. ఈ పనులను ఎస్ఎంసీ కమిటీ, రూ.30లక్షలు పైబడిన పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు చేపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమో.. కాంట్రాక్టర్ల అలసత్వమో కానీ.. వచ్చే విద్యా సంవత్సరం బడులు తెరిచే నాటికీ పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. కొన్ని పూర్తయినప్పటికీ ప్రజాప్రతినిధులు అందుబాటులో లేక ప్రారంభానికి నోచుకోవడంలేదు.

మోడల్ స్కూళ్ల పరిస్థితి కూడా..

'మన ఊరు–మనబడి' కింద ప్రతీ మండలానికి రెండు చొప్పున డిసెంబర్‌లోనే మోడల్ స్కూళ్లు ప్రారంభిస్తామని అధికారులు పలుసార్లు ప్రకటించారు. అయినప్పటికీ పనులు పూర్తిస్థాయిలో కాకపోవడంతో వాయిదా పడింది. ఇటీవల జిల్లా కేంద్రంలో ఐదు పాఠశాలలనే ప్రారంభించారు. మరో 32 మోడల్ స్కూళ్లు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఇంద్రవెల్లిలోని అందునాయక్‌తండా, మామిడిగూడ (ఏ), ఉట్నూర్‌లోని ఎస్సీ కాలనీ, నార్నూర్‌లోని గుంజాల, మహర్‌గూడ, బోథ్‌లోని కొత అర్జునవాడ పాఠశాల, జైనథ్‌లోని కరంజి (కే), బేలలోని సైద్‌పూర్ పాఠశాలల పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు అందుబాటులో లేక ప్రారంభానికి నోచుకోవడం లేదని తెలుస్తోంది.



ఆదిలాబాద్‌లోని గెజిటెడ్-1 పాఠశాలలో నిలిచిన కిచెన్ షెడ్ పనులు

జిల్లాలో 'మన ఊరు-మనబడి' వివరాలు

ఎంపికైన పాఠశాలలు: 237	కేటాయించిన నిధులు: రూ.80 కోట్లు
విడుదలైనవి: రూ.11.50 కోట్లు (సుమారు)	ఇప్పటివరకు ప్రారంభమైన పనులు: 5

వచ్చే విద్యా సంవత్సరం నాటికి సిద్ధం



'మన ఊరు–మనబడి' కార్యక్రమం కింద జిల్లాలో 237 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటికి సంబంధించి రూ.80కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ.11.50 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిగాయి. ఐదు మోడల్ స్కూళ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మిగతా 13 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వివిధ పాఠశాలల పనులు 70 నుంచి 90 శాతం వరకు పూర్తయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

నత్తనడకన పనులు

'మన ఊరు–మనబడి' కింద మొదటి విడతగా జిల్లాలోని 237 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటివరకు ఐదు పాఠశాలలు ప్రారంభానికి నోచుకోగా, మరో ఎనిమిది ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 224 పాఠశాలల పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీటిలో సగం కంటే ఎక్కువ పాఠశాలల్లో 50శాతం పనులు కూడా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఆదిలాబాద్‌అర్బన్, మావల, ఆదిలాబాద్‌రూరల్ మండలాలకు సంబంధించి 34 పాఠశాలలకు ఐదు పాఠశాలలు ప్రారంభించారు. మావల ఉన్నత పాఠశాలకు సంబంధించి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. గుడిహత్నూర్ మండలంలో తొమ్మిది పాఠశాలలకు ఒక్కటే పూర్తి దశలో ఉంది. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. జైనథ్ మండలంలో 22కు కరంజి పాఠశాల మాత్రమే ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గిమ్మలో పునాదికే పరిమితమైంది. బోథ్ మండలంలో 17కు కౌఠలోని అర్జునవాడ, ధన్నూర్ పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మిగతా చోట్ల పనులు కొనసాగుతున్నాయి. నేరడిగొండలో 14 పాఠశాలలకు ఒక్కటి కూడా ప్రారంభానికి దగ్గరలో లేదు. 50శాతం మాత్రమే పనులు జరిగాయి. బజార్‌హత్నూర్‌లో 11 పాఠశాలలకు తొమ్మిది చోట్ల 90 శాతం పనులు పూర్తయ్యాయి. భూతాయి, బోస్ర పాఠశాలల పనులు పూర్తి కాగా ఫర్నిచర్ రాలేదు. ఆన్‌లైన్‌లో బిల్లులు నమోదు చేసినప్పటికీ విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. తాంసిలో ఐదు పాఠశాలలకు రెండు పూర్తయ్యాయి. భీంపూర్‌లో తొమ్మిది పాఠశాలలకు ఒక్క చోట పనులు పూర్తి కాలేదు. బండల్‌నాగాపూర్, కప్పర్ల పాఠశాలల పనులు పూర్తయినప్పటికీ ఫర్నిచర్ రాలేదు. తాంసి పాఠశాల పునాదికే పరిమితమైంది. వడూర్‌లో విద్యుత్ పనులు పూర్తి చేశారు. సంప్ కోసం గుంత తవ్వి వదిలేయగా ప్రమాదకరంగా మారింది. నార్నూర్‌లో 11 పాఠశాలలకు ఒక్కటికూడా ప్రారంభం కాలేదు. గాదిగూడలో ఎనిమిది మంజూరు కాగా వాటి పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇచ్చోడలో 16 పాఠశాలలకు రెండు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అడిగామ, ఇస్లాంనగర్ పాఠశాలలను ఈనెల 28న ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సిరికొండలో ఆరు పాఠశాలలకు పొన్న, సుంకిడి పాఠశాలల పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంద్రవెల్లిలో 17 పాఠశాలలకు రెండు చోట్ల పనులు పూర్తయ్యాయి. మామిడిగూడ, అందునాయక్ తండా పాఠశాలలు ప్రారంభించాల్సి ఉంది. తలమడుగు మండలంలో 12 పాఠశాలలకు సుంకిడి, కుచులాపూర్ పనులు పూర్తయ్యాయి. ఫర్నిచర్ రాలేదు.

విద్యార్థులు మేధాశక్తిని పెంచుకోవాలి



టెస్ట్‌పేపర్ ఆవిష్కరిస్తున్న డీఐవో, నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు మేధోశక్తిని పెంచుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐవో) రవీందర్ సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మావల సమీపంలోగల నలంద జూనియర్ కళాశాలలో టీపీవీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూనే టీపీవీఎస్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం టీపీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ మాట్లాడుతూ.. పట్టణ, మండల స్థాయిలో మండలానికి టాప్ ఐదుగురిని ఎంపిక చేసి జిల్లా స్థాయి టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభకనబర్చిన ముగ్గరికి, అలాగే ప్రభుత్వ పాఠశాలలో రాసిన టాప్ విద్యార్థికి షీల్డ్, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో నిహారిక, గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నలంద కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, టీపీవీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా అధ్యక్షుడు తుంరం ఈశ్వర్, జిల్లా కార్యదర్శి బైరి సోమేశ్, నాయకులు మెస్రం రాజు, రాహుల్, ఉయిక విష్ణు, ఆడ అర్జున్, దీపక్, ఆత్రం కిష్టన్న, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్మద, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపుల నిర్వాహకులు బెల్ట్‌షాపుల నిర్వాహకులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. గ్రామాల్లో ప్రధాన రహదారికి ఇరువైపులా పాన్‌షాపు, కిరాణా దుకాణాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు. స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, మండలాధ్యక్షుడు జుగ్నాక్ భరత్, నాయకులు గేడం భరత్, ఆత్రం హనుమంత్‌రావ్ తదితరులున్నారు.

'ఆదివాసీగూడేల అభివృద్ధి కాగితాలకే పరిమితం'



గిరిజాయి రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలో ఆదివాసీ గూడేల అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఆరోపించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సామస్‌పల్లి శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆదివాసీగూడేలు, భూతాయి(కే), గిరిజాయి, ఉమార్డ, బద్దునాయక్‌తండా, ఇంద్రనగర్ గ్రామాల్లో పార్టీ జిల్లా ప్రతినిధుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ప్రకటించుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ ఇప్పటివరకు ఒక్క మీటరు రోడ్డు వేయలేదని ఆరోపించారు. 15రోజుల్లో రోడ్ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనందరావ్, సోషల్‌మీడియా జిల్లా కోకన్వీనర్ బత్తుల రమేశ్, కోట్నాక్ గణేశ్, మల్యాల కరుణాకర్, మురళి, రాంసింగ్, హన్మంతు, దాసు, నాగోరావ్, మానాజీ, శంకరావ్, మధు, దత్తు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమానికి అండగా ఉంటా

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: హక్కుల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎలాంటి పోరాటాలకు పిలుపునిచ్చినా తనవంతుగా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఇటీవల ఎన్నికైన జిల్లా బీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బీసీ సంక్షేమానికి కృషి చేశానని గుర్తు చేశారు. అంతకు ముందు పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, అభివృద్ధికి ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా నిధుల కేటాయింపు జరగలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వడం లేదన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు మాట్లాడుతూ.. జిల్లాలోని 18 మండలాల్లో మూడు నెలల్లోగా కమిటీలు నియమిస్తామని, ఆ తర్వాత జిల్లా కేంద్రంలో బీసీ గర్జన సభ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. జిల్లాలోని బీసీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కార్యవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, డాక్టర్ రవికిరణ్‌యాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాహుత్ మనోహర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినీరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రంగినేని మనీషా, మంచికట్ల ఆశమ్మ, శివయ్య, బియ్యాల అనసూయ, ధోని జ్యోతి, జక్కుల శ్రీనివాస్, నవీన్‌యాదవ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..



ఆదిలాబాద్‌రూరల్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ జెడ్పీ హైస్కూల్ 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకొన్నారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీ రాంరెడ్డి, గంగారెడ్డి, రాఘవేందర్, శివయ్య, సత్యనారాయణగౌడ్, నారాయణరెడ్డి, పాఠశాల సిబ్బంది వివేక్, దేవిదాస్, పూర్వ విద్యార్థులు సాయిరి స్వామి, గిరీశ్, శ్రీనివాస్, దేవన్న, సభాషిని, వెంకటి పాల్గొన్నారు.

తాంసి: మండలంలోని కప్పర్ల జెడ్పీ హైస్కూల్ 1990–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 50 మందికి పైగా పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరి పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అప్పటి గురువులు గుణవంత్‌రావు, నర్సయ్య, శ్రీనివాస్, స్వామి, దేవిదాస్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు వెంకట్రావు, దాస్, అరవింద్‌రెడ్డి, అవినాష్ ఉన్నారు.

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 1992–93 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 85మంది విద్యార్థులు అప్పటి హెచ్‌ఎం కబీర్ హైమద్, 10మంది ఉపాధ్యాయులను సన్మానించారు. వివిధ కారణాలతో పలువురు మిత్రులు మృతి చెందగా వారి కుటుంబాలకు ఆర్థికసాయం చేశారు. చదువుకున్న పాఠశాలకు రూ.20వేల విరాళం అందించారు. మున్ముందు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.



తాంసి: సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



జైనథ్: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

ఓసీ సంఘాల జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు




శివ ప్రసాద్‌రెడ్డి అశ్విన్ కుమార్

ఆదిలాబాద్‌అర్బన్: ఓసీ సంఘాల జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు కల్పించినట్లు ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు జనగం సంతోష్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతం శివ ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా జిల్‌పెల్లి అశ్విన్ కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓసీ సంఘాలను పటిష్ట పర్చడమే లక్ష్యమన్నారు.

మరాఠా కునబిలను ఓబీసీలో చేర్చుతాం



హన్సరాజ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్: మరాఠా కునబి, మరాఠా నాన్ బ్రాహ్మిణ్‌లను ఓబీసీ జాబితాలో చేర్చడానికి సుముఖంగా ఉన్నట్లు కేంద్ర మాజీ మంత్రి, జాతీయ బీసీ కమి షన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహీర్ పేర్కొన్నా రు. హైదరాబాద్ నుంచి చంద్రపూర్ వెళ్తూ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంక ర్ నివాసంలో ఆదివారం ఆయన విడిది చేశారు. ఈ సందర్భంగా మరాఠా కునబి సంఘం నాయకులు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని గంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన సా నుకూలంగా స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విషయమై ప్రతిపాదన అందితే, వెంటనే మరాఠా కునబి సమాజ్‌ను ఓబీసీ జాబితాలో చేర్చుతామని వెల్లడించారు. బీసీలందరికీ సామాజిక న్యా యం అందించాలనే దృష్టితో బీసీ కమిషన్ ముందు కు వెళ్తోందని చెప్పారు. నాయకులు నగేశ్, సుహాసినీరెడ్డి, విజయ్ బోయర్, జోగు రవి, మయూర్ చంద్ర, లోక ప్రవీణ్‌రెడ్డి, సోమ రవి, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

తాంసి: మండలంలోని సావర్గాం గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఉన్న చెరువులో ఆదివారం ఉదయం ట్రాక్టర్ బోల్తాపడింది. పిప్పల్‌కోటి నుంచి ఆదిలాబాద్‌వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ వేగంగా నడపడంతో మూలమలుపు వద్ద చెరువులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. డ్రైవర్‌కు రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

తనయుడి చితికి తల్లి నిప్పు



అంత్యక్రియల్లో తల్లి రాధ

జన్నారం: జన్నారం మండలం చింతగూడకు చెందిన దాసరి హర్ష (22) నిజామాబాద్ జిల్లా మెడికల్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతూ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శనివారం హర్ష మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి నివాళులర్పించారు. అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించగా గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తండ్రి శ్రీనివాస్ మలేషియాకు నెలరోజుల క్రితమే తాపీమేస్త్రీ పనిపై వెళ్లాడు. చివరిచూపునకు సైతం నోచుకోలేదు. దీంతో తల్లే కొడుకు చితికి నిప్పుపెట్టింది. ఈ దృశ్యం స్థానికులను కదిలించింది.



శివాజీచౌక్‌లో నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లే బస్సుల కోసం..



ఎండలో ‘ప్రయాణికుల’ ఎదురుచూపు

నిర్మల్ జిల్లా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా కేంద్రంలో ఇప్పటి వరకు పలు చౌరస్తాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాపులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో బస్టాప్‌ల వద్ద చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



బైంసా వెళ్లే ప్రధాన రహదారిపై



బస్సు షెల్టర్ లేక నేలపై కూర్చున్న వృద్ధులు, మహిళలు




బస్సు కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు


రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు

- పెన్సిల్స్ వ్యాపారం పేరిట టోకరా
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ మోసగాళ్లు రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఇదివరకు ఓటీపీ అడిగి డబ్బులు మాయం చేయడం, లింక్‌లు పంపించడం, కేవైసీ తదితర పేరిట డబ్బులు కాజేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇంటి వద్దనే ఉంటూ వ్యాపారం చేసుకోవచ్చు అంటూ నమ్మబలికి అందినకాడికి దండుకున్న ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన పట్కర్‌వార్ గంగాసింగ్ మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 30న ఆయన ఫోన్‌కు వాట్సాప్ ద్వారా ఓ వీడియో వచ్చింది. అందులో పెన్సిల్, రబ్బర్ ప్యాకింగ్ చేసి ఇంటివద్దనే ఉంటూ ఉపాధి పొందవచ్చని తెలిపారు. దీంతో ఆ వీడియోలోని ఫోన్‌నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకున్నాడు. మొదట ఐడెంటిటి కార్డు కోసం రూ.650 డబ్బులు పంపించాలని తెలుపగా, ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత అతని నుంచి మీరు పంపిన డబ్బులు



పంపించిన వీడియో, వాట్సాప్ చాటింగ్ దృశ్యం



బాధితుడు ఫోన్‌పే ద్వారా పంపించిన డబ్బులు

క్యాన్సల్ అయ్యాయి, రూ.1499 పంపించాలని చెప్పారు. జీఎస్టీ, వాహన అద్దె, పెన్సిళ్ల కోసం డబ్బులు పంపించాలని చెప్పడంతో రూ.1500, రూ.3100, రూ.4550, రూ.8700 ఇలా మొత్తం రూ.23,199 డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. సాయంత్రం వరకు హైదరాబాద్ నుంచి పెన్సిళ్లు వస్తాయని నమ్మబలికాడు. సాయంత్రం వరకు అవి రాకపోగా తాను మోసపోయానని తెలుసుకున్నాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా సైబర్‌క్రైమ్‌లో ఆన్‌లైన్ ద్వారా కేసు నమోదు చేశారు. ఆదివారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో అనేక మంది సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోతున్నారు. గతనెలలో ఓ వ్యక్తి క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల కోసం ఓటీపీ చెప్పగా రూ.49వేలు మోసపోగా, తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రశాంతంగా గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశపరీక్ష రాయడానికి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో కలిపి 88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 6వ తరగతిలో 618 మంది విద్యార్థులకు 536 మంది పరీక్షకు హాజరు కాగా మరో 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్‌లో 590 మందికి 518 మంది విద్యార్థులు పరీక్ష రాయగా మరో 72మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. ఉదయం 10గంటలకు ప్రవేశపరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల్లో చల్లటి నీటి కుండలతో పాటు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి సీఓఈ గురుకుల బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఆయా పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, సంగనబట్ల శ్రీనివాస్, కె.రమా కళ్యాణిలు తగిన ఏర్పాట్లు



బెల్లంపల్లి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో



హాల్‌టిక్కెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

చేశారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కోటి చింతల మహేశ్వర్‌రావు, జ్యోతి వ్యవహరించారు.

పరీక్ష కేంద్రాల వారీగా...

బెల్లంపల్లి సీఓఈ బాలుర గురకుల కళాశాలల్లో 6వ తరగతిలో 201 మంది విద్యార్థులకు 172మంది విద్యార్థులు పరీక్ష రాయగా 29మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 247మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 227మంది వచ్చారు. 20మంది పరీక్షకు దూరంగా ఉన్నారు.

ఆదిలాబాద్ గురుకుల బాలికల సీఓఈ పరీక్ష కేంద్రంలో...

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకుల సీఓఈలో 6వ తరగతిలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 170 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మరో 30మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీటియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 165మంది విద్యార్థులు హాజరు కాగా 34మంది పరీక్షకు హాజరు కాలేదు.

నిర్మల్ (జామ్) బాలికల గురుకుల కళాశాలలో ....

నిర్మల్ జిల్లా సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 6వ తరగతిలో 217 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 194 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. అదే తీరుగా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 126మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 18మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.



అడెల్లి ఆలయం ఎదుట భక్తుల సందడి

అడెల్లిలో భక్తుల సందడి

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌ల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ఇన్‌చార్జి ఈఓ రవికిషన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి ప్రత్యే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అడెల్లి అమ్మవారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

పులుల కదలికల పరిశీలన

తాంసి: భీంపూర్ మండలం గుంజాల, గొల్లఘాట్ గ్రామాల శివారులో మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన నాలుగు పులులు రెండు రోజులుగా సంచరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అటవీశాఖ అధికారులు వాటి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం గుంజాల శివారులోని అటవీ ప్రాంతంలో ఎఫ్‌ఎస్వో అహ్మద్‌ఖాన్ బేస్‌క్యాంపు సిబ్బందితో కలిసి పులులు సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. వాటి పాదముద్రలు సేకరించి కొలతలు తీసుకున్నారు. శనివారం బేస్‌క్యాంపు సిబ్బందికి పులులు కనిపించిన నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది గుంపులుగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్వో మాట్లాడుతూ.. పులులు సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బేస్‌క్యాంపు సిబ్బందితో పులుల



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

సంరక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గుంజాల అటవీ ప్రాంతం పులుల సంచారానికి అనువుగా ఉండడంతో అవి ఇక్కడే ఉన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. పులుల సంచారం నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారి గులాబ్‌సింగ్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, హనుమంత్, సోనేరావు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాలు ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

- చిలకల భీమన్న ఆలయానికి నిప్పు
- సకాలంలో గమనించిన స్థానికులు
- వరుస ఘటనలతో స్థానికుల్లో ఆందోళన
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



తగలబడుతున్న భీమన్న దేవాలయం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని దుబ్బగూడలోని చిలకల భీమన్న ఆలయంలో ఆదివారం దుండగుడు నిప్పంటించాడు. మండలంలోని ఖర్జెల్లి శివాలయలంలో విగ్రహాల ధ్వంసం చేసిన మరుసటి రోజే చిలకల భీమన్న ఆలయానికి నిప్పుపెట్టడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... చిలకల భీమన్న ఆలయం గ్రామం శివారులో ఉంది. ఆదివారం ఉదయం అటువైపు వెళ్లిన పలువురికి ఆలయంలోనుంచి పొగలు రావడాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. నిప్పంటించేందుకు సమీపంలోని పంట భూముల్లోని కర్రలను, ఆకులను సేకరించి ఆలయంలో పేర్చి నిప్పంటించినట్లు పోలీసులు గుర్తించారు.

నిందితుడి అరెస్టు

వరుస ఘటనలతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. చింతలమానెపల్లి గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఉదయం 7గంటల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన సలుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్ళపల్లి వెంకటేష్ అలియాస్ జోష్ అనే వ్యక్తిని గుర్తించారు. మండల కేంద్రం నుంచి అనుకోడ గ్రామానికి వెళ్లే మార్గంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ నెల 25న మండలంలోని ఖర్జెల్లి శివాలయంలో, 24న బెజ్జూర్ మండలంలోని అందుగులగూడెం మల్లన్నగుట్ట ఆలయం ధ్వంసం చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి తమ్ముడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. తన తమ్ముడి చావు కు హిందూ దేవుళ్లే కారణమని భావించి ఆలయాల ధ్వంసానికి పాల్పడినట్లు విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు.

దంపతులను విడదీసిన రోడ్డు ప్రమాదం



సంఘటన స్థలంలో సాగర్ మృతదేహం



తీవ్ర గాయాలపాలైన లలిత

- భర్త దుర్మరణం.. భార్య పరిస్థితి విషమం
- చాందా(టి) జాతీయ రహదారిపై ఘటన

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదం దంపతులను వీడదీసింది. ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్న క్రమంలో లారీ రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. మండలంలోని చాందా(టి) సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్య మృత్యువుతో పోరాడుతోంది. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని కేళాపూర్ తాలుకా టెంబి గ్రామానికి చెందిన రామగిరివార్ సాగర్ (60), రామగిరివార్ లలిత (55) దంపతులు ఆదిలాబాద్ పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చాందా(టి) శివారు ప్రాంతంలోని బైపాస్ రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొంది. సాగర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా భార్య లలితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆదిలాబాద్‌రూరల్ సీఐ రఘుపతి చేరుకుని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గోవింద్ వివరించారు.

దర్జీలకు దర్జా లేదిప్పుడు..!

- రెడీమేడ్‌తో తగ్గుతున్న టైలరింగ్
- దయనీయ పరిస్థితిలో దర్జీలు
- రేపు టైలర్స్ డే



బేలలో బట్టలు కుడుతున్న టైలర్లు

బేల: మారిన ఫ్యాషన్ ప్రపంచంలో దర్జీలకు దర్జా లేదిప్పుడు..! అన్నట్లు మారింది. రెడీమేడ్‌తో టైలరింగ్‌కు గిరాకీ తగ్గిందని, పరిస్థితి దయనీయంగా మారిందని దర్జీలు పేర్కొంటున్నారు. టైలర్ దుకాణాల కుట్టు కుదేల్ అవుతోంది. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, ఉచిత కరెంట్ అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 28న టైలర్ డే సందర్భంగా కథనం.

వెలవెలబోతున్న దుకాణాలు

మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయా గ్రామాల్లోని టైలర్ల సంఖ్య దాదాపు 220 వరకు ఉన్నాయి. ఇందులో పనిచేస్తున్న పురుషులు 150, మహిళల సంఖ్య 70 ఉంటుంది. ఏళ్ల క్రితం టైలరింగ్ దుకాణాల నిర్వాహకులు ఒక డ్రెస్‌కు రూ.100 నుంచి 250 వరకు తీసుకునేవారు. మంచి గిరాకీతో టైలర్ దుకాణాలు కళకళలాడేవి. ఇప్పుడు పెరిగిన ధరలకు అనుగుణంగా మండల కేంద్రంలో ఒక డ్రెస్‌కు రూ.450 నుంచి 550 వరకు తీసుకుంటున్నారు. రెడీమేడ్‌తో పోటీపడలేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఇందులో షర్ట్, ఫ్యాంట్ మేకర్ల కూలీతోపాటు దారం, మిషన్, కాజస్, క్లిప్స్, బటన్స్, బక్రమ్, కరెంటు బిల్లు, దుకాణం నిర్వహణ అద్దె ఖర్చు, తదితరవి ఉంటుంది. పెరిగిన ధరల అనుగుణంగా ఇవన్నీ ఖర్చుల పోను ఒక డ్రెస్‌కు రూ.100 వరకు మిగులు మాత్రం ఉంటుందని టైలరింగ్ దుకాణాల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

రెడీమేడ్‌కు ఆదరణ

అధునాతన రెడీమేడ్‌కు ఆదరణ పెరిగిందని, కుట్టుకుని బట్టలు వేసుకునే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. పనులు లేక టైలరింగ్ దుకాణాలు బోసిపోతున్నాయని టైలర్లు వాపోతున్నారు. దుకాణాల్లో పనిచేసే వారికి రోజు సరిపడా పని దొరకక కూలి పనులకు రావడం లేదని, దీంతో షాపు నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. దీంతో ఈ దుకాణాలు తప్పనిసరి పరిస్థితుల్లో నామమాత్రంగా కొనసాగుతుండగా, కొందరు బంద్ చేసిన సందర్భాలు లేకపోలేదు. కాగా పెళ్లిళ్లు, పేరంటాలతోపాటు ఇతరత్ర శుభకార్యక్రమాలకు అర్జెంటు ఉండడం, మార్కెట్‌లో కొలతలకు అనుగుణంగా రెడీమేడ్ బట్టలు మరింత అందుబాటులోకి వచ్చాయి.

పని ఉండడం లేదు



గతంలో టైలర్ దుకాణంలో కుట్టుతో పని ఉన్నట్టు, ప్రస్తుతం రెడీమేడ్‌తో పని తగ్గింది. ఇప్పుడు పరిస్థితి మారడంతో టైలరింగ్ కుట్టుతో పని ఉండడం లేదు. రోజుకు రెండు, మూడు ప్యాంట్లు మాత్రమే కుట్టడానికి లభిస్తున్నాయి. వారానికి ఒకట్రెండు రోజులు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ కుట్టు పనులు చేస్తున్న వారికి సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.
– అనిల్ సోన్‌కుసరే, ప్యాంట్ మేకర్

ఆదరణ తగ్గింది



గత 12 ఏళ్ల క్రితం వరకు టైలరింగ్‌కు మంచి గిరాకీ ఉండేది. ప్రస్తుతం రెడీమేడ్ ఫ్యాషన్‌తో ఆదరణ తగ్గింది. టైలరింగ్ దుకాణాల్లో వచ్చే గిరాకీ సైతం రోజురోజుకు తగ్గుతోంది. దారం, కాజస్, క్లిప్స్, బటన్స్, బక్రమ్, కరెంటు బిల్లు, మిషిన్ మరమ్మతు, తదితర పెరిగిన ధరలనుగుణంగా టైలర్ దుకాణం నిర్వహణ ఖర్చులు సైతం పెరిగాయి. దీంతో డ్రెస్‌కు రూ.100 కంటే తక్కువే మిగులుతోంది. ప్రభుత్వం టైలర్ దుకాణాలకు ఉచిత విద్యుత్ అందించాలి.
– బండారి గణేశ్, టైలర్ దుకాణం నిర్వాహకుడు, బేల

పంట చేలే క్రీడా ప్రాంగణమాయె..



తాంసి: మండలంలోని పాలోది గ్రామంలోని పంట చేలులో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. చేనులో బోర్డు ఏర్పాటు చేసి పంచాయతీ అధికారులు చేతులు దులుపుకున్నారు. చేలు గట్టున ఈ బోర్డు ఏర్పాటు చేయడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలోని పత్తి క్రరలు తొలగించి ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

ఉట్నూర్‌రూరల్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని పోలింగ్ బూత్ 101, 102, 103లో ఆదివారం శక్తి కేంద్రం స్థాయి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాథోడ్ రమేశ్ హాజరై మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక శేఖర్, నాయకులు జ్ఞానోబా, కొండేరి రమేశ్, వాసు, సర్పంచ్ ఉపేందర్, కిషన్, పరుశురాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మల్లన్న జాతర



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన జాతర మూడోరోజు కొనసాగింది. ఈ జాతరకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా స్వామివారిని పల్లకిలో గ్రామ వీధుల గుండా ఊరేగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

తలమడుగు: మండలంలోని ఝరి గ్రామానికి చెందిన 30 మంది యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తన నివాసంలో వారికి కండువా కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మెట్టి కిరణ్‌కుమార్, కన్వీనర్ వెంకటేశ్, సర్పంచులు అబ్దులా, శ్రీనివాస్‌రెడ్డి, పల్లవి, సునీతారెడ్డి, ప్రకాశ్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ అన్నారు. శ్రీ జగదాంబ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని రాజురా గ్రామంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోథ్ మండలం ఘన్‌పూర్ జట్టు విజేతగా నిలవగా ప్రథమ బహుమతితో పాటు ట్రోఫీ, రూ.21 వేల నగదు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన ఇచ్చోడ జట్టుకు రూ.10 వేల నగదు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలు, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. సర్పంచ్ అనూషబాయి వసంతరావు, ఉప సర్పంచ్ కవిత విజయ్ కుమార్, నాయక్, అంబునాయక్, నారాయణ, రామారావు, కారోబారి గణేశ్, సవాయిరాం, రవీందర్, బాపూజీ, కాశీరాం, సొరజీ, పూజారి మంగ్యా మెగాజీ, జాదవ్ ధనరాజ్, యువకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేశ్



సురేశ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గంట సురేశ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ భవనంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నూతన ఉపాధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ బీసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



పండ్లు అందజేస్తున్న స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలో సాయివృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదిలాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి ఆదివారం అన్నదానం, పండ్లు, రాగి జావా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వృద్ధులను ఆదుకునేందుకు తనవంతుగా సహాయ సహకారం అందిస్తానన్నారు. ఏఎస్సై గణపతి, దేవిదాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

నేరడిగొండ: ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని సూచించారు. అధికారులు తమ తమ నివేదికలతో రావాలని కోరారు.

నూతన కార్యవర్గం

బేల: ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల దివ్యాంగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆత్రం సంతోష్, ఉపాధ్యక్షుడిగా బోనిగిరివార్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా గేడాం సునీత, సహాయ కార్యదర్శిగా కాత్లే భీంరావు, కోశాధికారిగా భీంరావులతో పాటు మరో 10సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు మేస్రం నగేశ్, పుసాం శాలిక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నబావు సాఠేను ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

ఇచ్చోడ: యువత అన్నబావు సాఠేను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలకేంద్రంలో అన్నబావు సాఠే విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జాతిని జాగృతం చేయడానికి అన్నబావు సాఠే తన రచనలు, కవితలతో ఎంతో మందిని చైతన్యపర్చారని అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహం ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మండల కేంద్రంలో అన్నబావు సాఠే విగ్రహం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ చౌహాన్ సునీత, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, నాయకులు మెహరాజ్ అహ్మద్, ముస్తాఫా, సుభాష్‌పటేల్, వెంకటేశ్, అన్నబావు సాఠే కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు హాథ్ సే హాథ్ జోడోయాత్ర



కాలనీవాసులతో మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఏడో రోజుకు చేరుకుంది. పట్టణంలోని దుర్గానగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎలాంటి అభివృద్ధి ఫలాలు అందుతాయో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దని, నల్లధనం వెనక్కి తెప్పించి పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి మోసగించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనతో ప్రజలు విసుగెత్తారని, ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేశ్, మావల ఎంపీటీసీ గోవర్ధన్‌రెడ్డి, గౌస్, రాజు, గంగమ్మ, కవిత, ఆడే సంతోష్, సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న భూమన్న

ఇచ్చోడ: అర్హులందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీఆర్‌ఎస్ కార్యకర్తలకే దళితబంధు ఇవ్వడం ద్వారా లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. బోథ్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్క లబ్ధిదారుడి నుంచి రూ.2 నుంచి 3 లక్షల వరకు వసూలు చేసి దళితబంధు ఇప్పిస్తామని ఆశచూపుతున్నారని ఆరోపించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రమేయం లేకుండా జిల్లా కలెక్టర్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇచ్చోడ మాల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు ఐండ్ల శశికాంత్, నిమ్మల ప్రశాంత్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ విగ్రహప్రతిష్ట



విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న గ్రామస్తులు

తాంసి: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. విగ్రహాన్ని డప్పుచప్పుళ్లతోపాటు పోతరాజుల విన్యాసాల మధ్య గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. మంగళహారతులతో మహిళలు పాల్గొనగా ఊరేగింపులో పోతరాజులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు అరుణ్, గోవర్ధన్, కాంత్‌రెడ్డి, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



వాలీబాల్ ఆడుతున్న ప్రారంభిస్తున్న ప్రేమేందర్

ఆదిలాబాద్: రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని డైట్ కళాశాల మైదానంలో గల తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఎంసీఏ వాలీబాల్ క్లబ్ క్రీడాశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ వాలీబాల్ క్లబ్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు ముస్తఫా, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

- ఎమ్మెల్యే జోగు రామన్న
- సోనార్‌గల్లీలో అభివృద్ధి పనులకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నేతలు అనవసర విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. పట్టణ ప్రగతి నిధులతో స్థానిక 32వ వార్డు పరిధిలోని సోనార్‌గల్లీలో రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, మురుగుకాల్వల నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. అంతకుముందు కాలనీకి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానికులు బ్యాండ్‌మేళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులను శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ కోసం దాదాపు రూ.25 కోట్ల నిధులు వెచ్చిస్తున్నామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి అమృత్ పథకం కింద వచ్చిన నిధులను పక్కదోవ పట్టించారని బీజేపీ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కమిషనర్ శైలజ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, ఫ్లోర్‌లీడర్ సతీశ్, వార్డు కౌన్సిలర్ మోబిన్, మహిళా అధ్యక్షురాలు స్వరూప, నాయకుడు సాజిద్, కోఆప్షన్ సభ్యులు ఏజాజ్ పాల్గొన్నారు.



వైద్యుల ద్వారా బీపీని పరీక్షించుకుంటున్న ఎమ్మెల్యే

డబుల్ ఇంజన్ వద్దు.. రైతు రాజ్యమే ముద్దు..

డబుల్ ఇంజన్ ప్రభుత్వం వద్దని.. రైతు రాజ్యమే ముద్దని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పలువురు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డు నం.4అనుకుంటాలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి వంద మంది యువకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు గ్రామంలోని పురవీధుల గుండా డీజే చప్పుళ్ల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, జోగు మహేందర్, దాసరి రమేశ్, పర్వీన్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం పెద్దపీట

ప్రజారోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డు నం.4 అనుకుంటాలో ఏర్పాటు చేసిన బస్తీ దవఖానాను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. బస్తీ దవాఖానాలో కల్పించిన వసతులను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే అక్కడి వైద్య సదుపాయాలను పరిశీలించి వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

ఆ తీర్మానం వెనక్కి తీసుకోవాలి



మశాల(బి)లో చర్చిస్తున్న ఆదివాసీ నాయకులు

బేల: రాష్ట్ర ప్రభుత్వం 11 కులాలను ఎస్టీలో కలిపే తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సిడాం నందకుమార్ డిమాండ్ చేశారు. మశాల(బి) గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో 26 గ్రామాల పటేళ్లు, మహాజన్లు, 9 తెగల కులపెద్దల సమక్షంలో ఆదివారం ఆదివాసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆదివాసీలందరూ ఐక్యంగా ఉద్యమానికి సిద్ధమవుతారని తెలిపారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు ఆడ సంతోష్, కొట్నాక్ రాంజీ, కొరంగే సోనేరావు, మేస్రం గోద్రు, ఆడ సోనేరావు, కుమ్ర ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం ముగింపు



రథానికి పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలో బాజీరావ్ బాబా సప్తాహం ముగింపు వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి గ్రామ ప్రధానవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. దేవతా వేషధారణలో ఉన్న చిన్నారులను రథంపై కూర్చోబెట్టి పల్లకి వెంట నడిపించారు. మహిళలు మంగళహారతులతో ముందుకుసాగగా, భక్తులు భజనలు, కీర్తనలు నిర్వహించారు. నృత్యాలు, కోలాటాలతో యువకులు శోభాయాత్రలో పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్: సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం ఆదివారంతో 101 వారాలు పూర్తి చేసుకుంది. ప్రతి ఆదివారం అన్నదానం చేస్తూ ఆకలిని తీర్చుతున్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం అన్నదానం చేశారు. కష్టజీవులకు, ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం చేసి వారి కడుపు నింపారు. నిర్వాహకుడు సంగెం సుధీర్ కుమార్, మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, శేఖర్, రాజయ్య, గణేశ్, తదితరులు ఉన్నారు.

స్మైల్ సొసైటీ అన్నదానం

ఎదులాపురం: స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. గత 14 వారాలుగా ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం చేపడుతున్నారు. అన్నదానంతో రోగుల సహాయకులు, నిస్సహాయులు, పేదల ఆకలి తీరుస్తున్నారు. ఇందులో సొసైటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సురేశ్, యాదవ్‌రావు, సాయిగౌడ్, రామకృష్ణ, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి తోడ్పడాలి

ఆదిలాబాద్‌టౌన్: గౌడ కులస్తుల సంక్షేమాభివృద్ధికి తోడ్పాటునందించాల్సిన అవసరం ఉందని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా నిర్వాహకుడు రమేశ్ చందర్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని తనిషా గార్డెన్స్‌లో గౌడ కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు ఎం.నర్సాగౌడ్, ఆంజనేయులుగౌడ్, భూపతిగౌడ్, ఆర్.సంజీవ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ నాటక ప్రదర్శన

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి)లో అర్లి గ్రామ కళాకారులు ఎల్లమ్మ నాటక ప్రదర్శించారు. గ్రామంలో మూడు రోజులు నిర్వహించే ఈ ప్రదర్శనను శనివారం రాత్రి ప్రారంభించారు. ఎల్లమ్మ తల్లి జననం, మహిమ వంటి వాటిని కళాకారులు ప్రత్యేక వేషధారణతో తెలియజేశారు. భూమన్న, దత్తు ఉన్నారు.